క్లుప్తంగా

సీఎం జగన్ దృష్టికి నిర్వాసితుల సమస్యలు


సీఎంను కలిసిన ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సోమవారం సాయంత్రం బాలరాజు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఉన్న రోడ్ల పరిస్థితిని వివరించి వాటికి నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలోని రెండో విడతకు మంజూరు కావాల్సిన గృహాలపై విషయం కూడా మాట్లాడినట్లు చెప్పారు.

మంత్రి వనితను కలిసిన పద్మ


వనితను కలిసిన శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలు వెంకటకొండ పద్మ, జ్యోతి శ్రీనివాస్

ద్వారకాతిరుమల: రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనితను ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలు పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, జ్యోతి శ్రీనివాస్ దంపతులు సోమవారం సెక్రటరియేట్ (అమరావతి)లోని ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కొద్దిసేపు ఆమెతో ముచ్చటించారు. వారి వెంట కొవ్వూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తోట రామకృష్ణ ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్వారకాతిరుమల: స్థానిక కుంకుళ్లమ్మ ఆలయం వద్ద 33 కేవీ విద్యుత్ టవర్ నిర్మాణ పనులను పురస్కరించుకుని మంగళవారం ద్వారకాతిరుమల, దొరసానిపాడు గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈఈ నరసింహస్వామి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఆసరా.. మగువలకు భరోసా

కొయ్యలగూడెం: ముఖ్యమంత్రి జగనన్న పాలనలో ప్రతి మగువ ఆర్థికాభివృద్ధికి, రక్షణకు భరోసా ఏర్పడిందని వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఏఎంసీ యార్డ్ ప్రాంగణంలో సోమవారం వైఎస్సార్ ఆసరా 4వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్వాక్రా రుణాల మాఫీ, అమ్మఒడి, చేయూత వంటి పథకాలతో మహిళల ఆర్థికాభివృద్ధికి జగనన్న కృషి చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సమూల మార్పులతో జగనన్న ప్రభుత్వం దేశానికే మార్గదర్శకంగా నిలిచిందన్నారు. చంద్రబాబు వ్యక్తినే కాదు ఆ పేరును కూడా తలవడానికి ప్రజలు భయపడుతున్నారన్నారు. దొంగల ముఠా మరోసారి దోచుకోవడానికి ఎన్నికలను సాకుగా చూపి మీ ముందుకు వస్తోందని వాళ్లని తరిమికొట్టండి అంటూ పిలుపునిచ్చారు. జగనన్న పాలనలో 124 సార్లు బటన్ నొక్కి లక్షల కోట్ల రూపాయలు సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు అందజేశారనీ, మనం ఒక్కసారి ఎన్నికలలో బటన్ నొక్కి రుణం తీర్చుకుందామని సభలో పాల్గొన్న వారి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మహిళలు అందరితో కలిసి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆసరా నాలుగో విడత మండల వ్యాప్తంగా లబ్ధిదారులైన 15,015 మందికి రూ.13 కోట్ల 53 లక్షల చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ళా భాస్కరరావు, స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ గంజి మాలాదేవి, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు తోట కృపామణి, ఏఎంసీ చైర్మన్ తాడిగడప రామకృష్ణ, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అబ్జర్వర్ విజ్జు వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు, సీసీలు కృష్ణ, జ్యోతి, సైదారావు సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.


కొయ్యలగూడెంలో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి

జగనన్నకు రుణపడి ఉంటాం



జగనన్న ఇచ్చిన భరోసాతో చిన్న పరిశ్రమను స్థాపించాను. చిరుధాన్యాలతో "గుడ్ హెల్త్ ఫుడ్ ప్రొడక్ట్స్ బ్రాండ్" తో ఉత్పత్తులు ప్రారంభించి నాతో పాటు ముగ్గురికి ఉపాధి కల్పిస్తున్నాను. ఇంతటి గొప్ప అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగనన్నకు మేమంతా రుణపడి ఉన్నాం.

తోటా కృపామణి, రాష్ట్ర స్త్రీ నిధి డైరెక్టర్, ఆరిపాటి

మహిళలకు పెద్ద పీట



మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారు. అందుకే ఆసరా పథకం అమలు చేసి విడతలు వారీగా ఆసరా సొమ్ము అందిస్తున్నారు. మహిళలు చిరు వ్యాపారాలను పెట్టుకుని జీవనోపాధిని మెరుగుపర్చుకోవడానికి ఆసరా ఉపయోగపడుతోంది. మళ్లీ జగనన్నే సీఎంగా రావాలి.

– విగ్గిన వెంకటలక్ష్మి, యర్రంపేట పీఏసీఎస్ అధ్యక్షురాలు

రాజమండ్రి వెళ్లి పింఛన్ అందజేత


రాజమండ్రి డెల్టా ఆస్పత్రికి వెళ్లి బాషాకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నాంచారయ్య

కామవరపుకోట: కిడ్నీ సంబంధిత వ్యాధితో రాజమండ్రి డెల్టా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు పింఛన్ లబ్ధిదారు కామవరపుకోటకు చెందిన షేక్ మదీనా బాషాభాష. దీంతో ఈనెల అందించాల్సిన పింఛన్ సొమ్మును వలంటీర్ వెంకట నాంచారయ్య రాజమండ్రి ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేసి ఔదార్యం చాటుకున్నాడు. దీంతో వలంటీర్‌కు బాష కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్లను శాశ్వతంగా తొలగించాలి

జంగారెడ్డిగూడెం: ఎర్రకాలువ ప్రాజెక్టు ఇరిగేషన్ భూముల్లో అక్రమ విద్యుత్ కనెక్షన్లు శాశ్వతంగా తొలగించాలని సీపీఎం జంగారెడ్డిగూడెం మండల కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం జగనన్నకు చెబుదాం. కార్యక్రమంలో ఆర్డీవో అద్దయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్ రావు, యాగంటి సీత, జి.సూర్య కిరణ్, పార్టీ సభ్యులు నరసింహారావు, సుబ్బారావు, నాని, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన అధికారులు


జి.రవికాంత్, ద్వారకా తిరుమల తహసీల్దార్


దాసరి అచ్యుతకుమారి, కుక్కునూరు తహసీల్దార్


టి.సుభాష్, టి.నరసాపురం తహసీల్దార్


కె.రాజ్యలక్ష్మి, కొయ్యలగూడెం తహసీల్దార్


జె.స్వర్ణ భారతి కె.కోట ఎంపీడీవో


పి.గోపాలకృష్ణ, చింతలపూడి తహసీల్దార్


బీజేఎస్ ప్రసాద్‌రాజు, నగర పంచాయతీ కమిషనర్


జీవీఎస్ ప్రసాద్, పోలవరం తహసీల్దార్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల నూతన తహసీల్దార్‌గా జి.రవికాంత్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు కృష్ణా జిల్లా మచిలీపట్నం కలక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఆయన బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ముందుగా ఆయన శ్రీవారి ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో మండలంలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

కుక్కునూరు తహసీల్దార్‌గా అచ్యుతకుమారి

కుక్కునూరు: కుక్కునూరు తహసీల్దార్‌గా దాసరి అచ్యుతకుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సెక్రటరీయేట్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా, రాజమండ్రి సివిల్ సప్లెయ్ డీటీగా విధులు నిర్వహించిన అచ్యుతకుమారికి తహసీల్దార్‌గా ఇది తొలి పోస్టింగ్. కాగా నూతన తహసీల్దార్‌కు కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పూల బోకే ఇచ్చి స్వాగతం పలికారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డీఎల్ ప్రమద్వర కోనసీమ జిల్లా అయినవెల్లికి బదిలీ పై వెళ్లారు.

టి.నరసాపురం తహసీల్దార్‌గా టి.సుభాష్

టి.నరసాపురం: టి.నరసాపురం తహసీల్దార్‌గా టి.సుభాష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కాకినాడ డివిజన్ పెదపూడి మండలంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల ప్రజలందరికీ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన జేవీ సుబ్బారావు కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లారు.

కొయ్యలగూడెం తహసీల్దార్‌గా రాజ్యలక్ష్మి

కొయ్యలగూడెం: నూతన తహసీల్దార్‌గా కె.రాజ్యలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం నుంచి బదిలీపై ఆమె ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలను సిబ్బందితో కలిసి సమర్థవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ రాజ్యలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

కామవరపుకోట ఎంపీడీఓగా స్వర్ణభారతి

కామవరపుకోట: కామవరపుకోట మండల మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా జె.స్వర్ణభారతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన కంతెటి శ్రీదేవి ప్రభుత్వ బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా కాట్రేనికోన మండలం వెళ్లారు. ఆమె స్థానంలో, కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలంలో ఎంపీడీవోగా పనిచేస్తున్న జె.స్వర్ణభారతి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

చింతలపూడి తహసీల్దార్‌గా గోపాలకృష్ణ

చింతలపూడి: చింతలపూడి తహసీల్దార్‌గా పి.గోపాలకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన కృష్ణజ్యోతి అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని చెప్పారు. మండలంలో రెవెన్యూ పరంగా ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి నేరుగా తీసుకురావాలని కోరారు.

నగర పంచాయతీ కమిషనర్‌గా ప్రసాద్‌రాజు

చింతలపూడి: చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్‌గా బీజేఎస్ ప్రసాద్‌రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన ఎస్ రాంబాబు అన్నమయ్య జిల్లా రాజంపేట బదిలీ అయ్యారు. ప్రసాద్ రాజు మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పోలవరం తహసీల్దార్‌గా జీవీఎస్ ప్రసాద్

పోలవరం రూరల్: పోలవరం తహసీల్దార్‌గా జీవీఎస్ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన బి.సుమతిని కృష్ణాజిల్లాకు బదిలీ చేశారు. నూతన తహసీల్దార్ ప్రసాద్ స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది నుంచి మండలంలోని పరిస్థితులను తెలుసుకున్నారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ప్రసాద్‌కు శాలువా కప్పి అభినందించారు.

లక్కవరం సొసైటీ చైర్మన్‌గా నాగేశ్వరరావు


బాధ్యతలు చేపట్టిన నాగేశ్వరరావు

జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరం సొసైటీ చైర్మన్‌గా దల్లి నాగేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు రుణాలు, సబ్సిడీలు అందించేలా పనిచేస్తానన్నారు. ధాన్యం సంచులు సకాలంలో అందించేలా కృషి చేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేవీ సత్యనారాయణ, గురజాల పార్థసారథి, బండారు నాగేశ్వరరావు, పత్తి వీరాస్వామి, కంభపు ప్రసాద్, పరపతి వెంకటేశ్వరరావు, రైతులు నాగేశ్వరరావును అభినందించారు.

రాఘవాపురం పాలకవర్గం ప్రమాణ స్వీకారం


రాఘవాపురం సహకార సంఘం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న గిరి భోగారావు

చింతలపూడి: రాఘవాపురం సహకార సంఘం చైర్మన్‌గా గిరి భోగారావు, డైరెక్టర్లుగా తాటిపర్తి తిరుపతి గోపాలరావు, కొరిపల్లి నాగసుబ్బారావు సోమవారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ భోగారావు ఈ సందర్భంగా చెప్పారు. తమకు అవకాశం కల్పించిన ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

జంగారెడ్డిగూడెంలో...


బాధ్యతలు స్వీకరిస్తున్న పీఏసీఎస్ త్రీమన్ కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన త్రీమన్ కమిటీ బాధ్యతలు చేపట్టింది. చైర్మన్‌గా కంచర్ల రవీంద్రబాబు, పర్సన్‌లుగా కేమిశెట్టి మల్లికార్జునరావు, ముప్పిడి నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం త్రిమన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తామన్నారు. రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ, సంఘాన్ని లాభాల బాటలో పనియనించేలా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు.

నేడు కౌన్సిల్ సమావేశం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం ఉదయం 11.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తెలిపారు. చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే


వాసిరెడ్డి మధు

టి.నరసాపురం: చింతలపూడిలో చంద్రబాబు నిర్వహించిన రా.. కదలిరా సభలో వ్యవసాయం గురించి పూర్తి అవాస్తవాలు మాట్లాడి తన నైజాన్ని మరొకసారి నిరూపించుకున్నారని ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షులు వాసిరెడ్డి మధు అన్నారు. చంద్రబాబు తాను అధికారంలో ఉండగా ఆయిల్‌పామ్ రైతులకు టన్నుకు రూ.18 వేలు ఇచ్చానని, తానే పామాయిల్ రైతులను ఆదుకున్నానని పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. నిజానికి టీడీపీ అధికారంలో ఉండగా, టన్ను పామాయిల్ ధర రూ.7500 మాత్రమే అని గుర్తు చేశారు. ఆ ప్రభుత్వ హయాంలో ఆయిల్ రికవరీ రేటు 16.4 ఉండగా, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆయిల్ రికవరీ రేటును 19.2కు పెంచారని వివరించారు. తెలంగాణకు, మన రాష్ట్రానికి టన్ను పామాయిల్ ధరలో రూ.3 వేలు వ్యత్యాసం ఉండగా, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే పామాయిల్ రేట్ల వ్యత్యాసాన్ని రూ.95 కోట్లు చెల్లించారని గుర్తు చేశారు.

జీలుగుమిల్లిలో జబర్దస్త్ కళాకారుల సందడి

బుట్టాయగూడెం: జీలుగుమిల్లిలో జబర్దస్త్ కళాకారులు సోమవారం సందడి చేశారు. గారపాటి చౌదరి ఆధ్వర్యంలో కళాకారులు అదిరే అభి, అప్పారావు, బాబీ, వినోదిని, ఇస్మాయేల్, తదితరులు కళాప్రదర్శనలు ఇచ్చారు. దర్భగూడెం, ములగలంపల్లి గ్రామాల్లో కళా ప్రదర్శన ద్వారా బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. సినీ గాయకులు లాస్యప్రియ, అరుణ్ కౌండిన్య పాటలతో అలరించారు. కార్యక్రమంలో సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, బీజేపీ నాయకులు, పాల్గొన్నారు.

శివ మండపంలో వృద్ధ యాచకుడు మృతి

ద్వారకాతిరుమల: స్థానిక సూపర్‌బజార్ ఎదురుగా ఉన్న శివ మండపంలో ఒక యాచకుడు సోమవారం ఉదయం మృతి చెందాడు. వివరాల ప్రకారం. సుమారు 70 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వృద్ధుడు గత కొన్నాళ్లుగా క్షేత్రంలో భిక్షాటన చేస్తూ, జీవిస్తున్నాడు. అయితే రోజులానే ఆదివారం రాత్రి శివ మండపంలో నిద్రించాడు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న అతడు ఉదయం మృతి చెందాడు. వైఎస్సార్ సీపీ నాయకుడు యిమ్మడి నాగు ఆర్థిక సహాయంతో దేవస్థానం సిబ్బంది వృద్ధుడి మృతదేహాన్ని ఖననం చేశారు.

విద్యార్థులను హింసించారంటూ..

కొయ్యలగూడెం: తమ పిల్లలను వేధించి హింసించారంటూ విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఆరోపించారు. కొయ్యలగూడెం లోని బీసీ బాయ్స్ ప్రీ మెట్రిక్ హాస్టల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను హాస్టల్ వార్డెన్ తో పాటు సిబ్బంది కొట్టి గాయపరిచారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంకాలగూడెం, కొయ్యలగూడెంలోని రెండు బీసీ సంక్షేమ హాస్టళ్లు ఒకే అధికారి పర్యవేక్షణలో ఉన్నాయని, ఈ నేపథ్యంలో నాలుగవ తేదీ తమ పిల్లలను అకారణంగా కొట్టడంతో గాయపడ్డారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొందరు విద్యార్థులను తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకువెళ్లిపోగా మరికొందరు విద్యార్థుల తల్లిదండ్రులు స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవికి, అదేవిధంగా జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఇరువురి ప్రజాప్రతినిధులు సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎరువులు, పురుగుమందుల దుకాణాల తనిఖీలు

ద్వారకాతిరుమల: మండలంలోని తిమ్మాపురానికి చెందిన శ్రీ లక్ష్మీ గణపతి ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని, ద్వారకాతిరుమల సొసైటీకి చెందిన దొరసానిపాడులోని ఎరువులు విక్రయించే గోడౌన్‌ను ఏలూరు అసిస్టెంట్ డైరెక్టర్ వై.సుబ్బారావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఎరువులు కొన్న రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని వ్యాపారులను ఆదేశించారు. సార్వా సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత లేదని, కాంప్లెక్స్, యూరియా ఎక్కడైనా కొరత ఉంటే వెంటనే తన దృష్టికి తేవాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించే వ్యాపారులలైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి ఎ.దుర్గారమేష్ తదితరులున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వివాహిత అదృశ్యంపై భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ జె.భీమశేఖర్ తెలిపారు. వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన గొలుసు సాంబయ్య, అతని భార్య దుర్గాభవానీ చిన్నాయిగూడెంలోని జీడితోటలో కాపలా పనికి ఉంటున్నారు. ఈ నెల 3వ తేదీన దుర్గాభవానీ తోట యజమాని వద్ద నుంచి రూ.3500 తీసుకుని జంగారెడ్డిగూడెం వెళుతున్నట్లు చెప్పింది. అనంతరం తన తమ్ముడికి ఫోన్ చేసి ఒంగోలు వెళుతున్నానని, తన కోసం వెతకవద్దని చెప్పిందని, ఆమె ఆచూకీ తెలియకపోవడంతో భర్త సాంబయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రేపటి నుంచి టీబీఆర్ యూత్ క్రీడోత్సవాలు

బుట్టాయగూడెం: ఈ నెల 7 నుంచి 9 వరకూ మూడు రోజులపాటు బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టీబీఆర్ యూత్ ఆధ్వర్యంలో గిరిజన క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, సొసైటీ అధ్యక్షులు కొవ్వాసి నారాయణ, సర్పంచ్ బన్నే బుచ్చిరాజు తెలిపారు. సోమవారం టీబీఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడల పోస్టర్‌లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గ స్థాయిలో జరిగే వాలీబాల్, కబడ్డీ, నాటు బాణం, విలువిద్య పోటీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. క్రీడలకు సంబంధించి ఎటువంటి ఎంట్రీ ఫీజులేదని తెలిపారు.

క్రీడాకారులకు సన్మానం


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

జంగారెడ్డిగూడెం రూరల్: యువతీ, యువకుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం – ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారని జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కె.విజయ్‌ప్రసాద్ అన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో వాలీబాల్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మండలానికి చెందిన క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన పీఈటీ, పీటీలను సోమవారం జంగారెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో విజయ్ ప్రసాద్ క్రీడాకారులు, రిటైర్డ్ పీడీ పెన్మెత్స నరసింహరాజులకు దుశ్శాలువా కప్పి సన్మానించారు. ఎంపీడీవో విజయ్ ప్రసాద్ మాట్లాడుతూ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంలో ప్రభుత్వ కళాశాల రిటైర్డ్ పీడీ పెన్మెత్స నరసింహరాజు కృషి ఎంతగానో ఉందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలన అధికారి చుక్కా గోపాల కృష్ణ, సీనియర్ అసిస్టెంట్ హవీల గ్లోరీ, జూనియర్ అసిస్టెంట్ హుస్సేన్, టైపిస్ట్ సుధారాణి పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల విజయభేరి


జంగారెడ్డిగూడెం డిగ్రీ కళాశాలలో సాధించిన ట్రోఫీలతో విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో విజయభేరి మోగించారు. పోలవరం నియోజకవర్గంలో విద్యార్థినులు కబడ్డీ ప్రథమ స్థానం, చింతలపూడి నియోజకవర్గంలో విద్యార్థుల వాలీబాల్ జట్టు ద్వితీయ స్థానం, కబడ్డీ విద్యార్థినుల జట్టు ద్వితీయ స్థానం, విద్యార్థినుల వాలీబాల్ జట్టు ప్రథమ స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేసి కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్. ప్రసాద్‌బాబు విద్యార్థులకు సభాముఖంగా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోటీలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నిట్టా వినయ్‌కు అభినందనలు తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

పోలవరం రూరల్: పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి సోమవారం పరిశీలించారు. భోజనం నాణ్యత పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఈ పథకం విషయంలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. తాగునీటి వసతులపై కూడా ఆరా తీశారు.

నాక్ అవుట్‌కు చేరుకున్న టెన్నీకాయిట్ పోటీలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం బాలుర హైస్కూల్ 67వ రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలు సోమవారం జరిగాయి. అండర్-14, 17 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. రాష్ట్ర పరిశీలకులు ఎన్‌టీ ప్రసాద్ పర్యవేక్షణలో పోటీలు జరుగుతుండగా, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో లీగ్ దశ పూర్తి చేసుకుని నాక్‌అవుట్ దశకు శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలు, చిత్తూరు, కృష్ణ, అనంతపురం, కర్నూలు జిల్లాలు చేరుకున్నట్లు ఏలూరు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తెలిపారు.

సంతాప సభలో పాల్గొన్న విజయరాజు

జంగారెడ్డిగూడెం: పట్టణానికి చెందిన బోడ ఆనంద్ సతీమణి బోడ మాణిక్య సూర్యకళ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ సందర్భంగా సోమవారం సంతాప సభ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు ఈ కార్యక్రమంలో పాల్గొని బోడ ఆనంద్‌ను పరామర్శించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సూర్యకళ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మేడవరపు విద్యాసాగర్, ముప్పిడి అంజి, కేమిశెట్టి మల్లిబాబు, అనిల్‌గౌడ్, చిప్పాడ వెంకన్న, భోగరాజు నాని, హఫీజ్, వసంత్, పంతగాని వెంకన్న, అలుగు ఆనందశేఖర్, గంజి వినోద్, గర్సికూటి చిరంజీవి, కబీర్, వెంప ఐజక్, కాటం డేవిడ్, కాంగ్రెస్ నాయకులు జెట్టి గురునాథరావు, ముప్పిడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వేగవరం గ్రామ రెవెన్యూ పరిధిలో 12.49 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు భూస్వాములు ఆక్రమించుకుని అక్రమంగా పట్టాలు పొందారన్నారు. సదరు భూమిని సర్వే చేసి, ప్రభుత్వ భూములను స్వాధీన పరుచుకోవాలన్నారు. అలాగే ఆయా భూములను పేదలకు పంచాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కలింపూడి సుందర్రావు, మండల కార్యదర్శి సముద్రాల బాల సుందరం, సహాయ కార్యదర్శి బాడ యేసుపాదం తదితరులు పాల్గొన్నారు.